సాక్షి నంద్యాల

శనివారం । 14 । జూన్ । 2025



రక్తదాతా.. సుఖీభవ!

బంధువులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే కుటుంబ సభ్యులే రక్తదానం చేయరు. అయితే మేమున్నామంటూ రక్తదాతలు ముందుకు వస్తున్నారు.

8లో▸



రాజకీయ బదిలీలు

పశుసంవర్ధకశాఖలో బదిలీల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. రాజకీయ జోక్యం, పైరవీలు, బేరసారాల అనంతరం ఉత్తర్వులు జారీ చేశారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,603.52
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:26.376
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,269
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:96

న్యూస్‌రీల్

సజావుగా డీఎస్సీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో డీఎస్సీ - 2025 పరీక్షలు సజావుగా జరుతున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం సెషన్–1లో ఇంగ్లిష్, ఎస్‌జీటీ పరీక్షలు జరిగాయన్నారు. ఉదయం జరిగిన పరీక్షకు 870 మందికి గాను 811 మంది హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 871 మందికి గాను 855 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

పాండురంగాపురం సందర్శన



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న బీహార్ సర్పంచ్‌ల బృందం

నంద్యాల(అర్బన్): జాతీయ నిర్మల్ గ్రామ పురస్కార్, శుభ్రం అవార్డు, టూరిజం ఎక్సలెంట్ అవార్డులను పొందిన నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామాన్ని బీహార్ రాష్ట్రం సర్పంచ్‌ల బృందం శుక్రవారం సందర్శించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్) కోచ్ అంజన్‌కుమార్ బంజ్యా ఆధ్వర్యంలో సర్పంచ్‌ల బృందం గ్రామంలోని తాగునీటి వసతి, ఎస్‌హెచ్‌జీ గ్రూప్, రైతు సంఘాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం, తదితరాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను కొనియాడారు. గ్రామంలో ఏర్పాటు అయిన విశాలమైన రోడ్లు, పచ్చని చెట్లు, ప్రజలకు అవసరమైన సదుపాయాలపై సర్పంచ్‌లు అభివృద్ధిని ప్రశంసించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపు ద్వారా పచ్చళ్లతో పలువురికి ఉపాధి కల్పించడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ డోలావతమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తమరెడ్డి, కొండా మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్‌డీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

కర్నూలు(అర్బన్): తల్లికి వందనం నిధులు విడుదల కాని ఎస్సీ విద్యార్థులు పోస్టల్/బ్యాంకు ఖతాలకు ఎన్‌పీసీఐ లింకు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమం సాధికారత అధికారిణి కె.తులసీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి 930 మంది తల్లుల ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే 2,129 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థుల ఎన్‌పీసీఐ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. ఎస్సీ విద్యార్థులకు సింగిల్ బ్యాంకు అకౌంట్ మాత్రమే ఉండాలని, అది కూడా విద్యార్థి ఆధార్ లింకు ఉన్న బ్యాంకు అకౌంట్‌కే తల్లికి వందనం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 16లోగా పూర్తి చేయాలన్నారు.

కోట్ల దారి.. నాణ్యత నీరుగారి

నగు'బాట'

మా ప్రభుత్వంలో రోడ్లు వేస్తున్నామనిపించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. 20 రోజుల్లో తారుపోసి చేతులు దులుపుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే 'కోట్ల' హడావుడిగా ప్రారంభం చేసి గొప్పలు చేసుకున్నారు. తీరాచూస్తే.. ఒక్క రోజుకే ఆ రోడ్డు కాస్తా 'తారు'లేచిపోయింది.



కూటమి ప్రభుత్వం మాటలకు.. చేతలకు పొంతన లేకుండా పోతోంది. కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని హడావుడి చేసి చివరకు నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఘనంగా ప్రారంభించిన రోడ్డే మరుసటి రోజు వర్షానికి కొట్టుకుపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పూసిన తారు చెదిరిపోయి.. నాసిరకం కంకర కొట్టుకుపోయి.. రోడ్డు కోతకు గురైంది. కొత్త రోడ్డు అందుబాటులోకి వచ్చిందని ముచ్చట పడిన గ్రామస్తులకు రెండు రోజుల్లో గుంతల రోడ్డు దర్శనమిచ్చింది.



- చిన్న వర్షానికి కోతకు గురైన చిన్నపొదిళ్ల–గుండాల రోడ్డు
- రూ.3.80 కోట్లు మట్టిపాలు
- ఈ నెల 11న రోడ్డును ప్రారంభించిన డోన్ ఎమ్మెల్యే
- 12వ తేదీన కొట్టుకుపోయిన రహదారి

ప్యాపిలి: రహదారులు గ్రామాల అభివృద్ధికి చిహ్నాలు. అలాంటి రహదారుల నిర్మాణంలో కూటమి నేతల జోక్యంతో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేస్తునానరు. చిన్నపొదిళ్ల నుంచి గుండాల వరకు 4 కిలో మీటర్ల మేర రూ. 3.80 కోట్లు వెచ్చించి గత నవంబర్‌లో రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే ఈ రోడ్డు నిర్మాణం విషయంలో అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కేవలం 20 రోజుల వ్యవధిలో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారంటే ఎంత మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించారో అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్డును ఈ నెల 11న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. 12వ తేదీ తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా కోతకు గురికావడంతో పాటు ఆ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. విషయం తెలుసుకున్న అధికారులు తమ తప్పును కప్పిపుచ్చేందుకు రోడ్డుపై పడిన గుంతలను మట్టితో పూడ్చారు. రోడ్డు కోతకు గురైన ప్రదేశంలో దగ్గరలోనే కల్వర్టు ఉంది. అయితే కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు ఈ కల్వర్టులోకి వర్షం నీరు వెళ్లే ఏర్పాటు చేయలేదు. దీంతో కల్వర్టులోకి వర్షం నీరు వెళ్లే మార్గం లేక ఆ నీరు ఒక్కసారిగా రోడ్డుపై ప్రవహించాయి. నాసిరకంగా వేసిన రోడ్డు ప్రవాహ వేగానికి కోతకు గురైంది. రోడ్డుపై నుంచి పారిన వర్షపు నీరు అటు వైపు ఉన్న పొలాల్లోకి చేరడంతో పొలాలు కోతకు గురయ్యాయి. వర్షం వస్తే పంటలు సాగు చేసేందుకు పొలాలను సిద్ధంగా ఉంచుకున్న రైతులుఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన తమ పొలాలను ఎలా పూడ్చుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంలా మారిందని వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో వేసిన రోడ్లు పదిలం..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. నాణ్యత విషయంలో అధికారులతో తరచూ రివ్యూ మీటింగ్‌లు నిర్వహిస్తూ, ఆకస్మిక తనిఖీలు చేస్తూ స్వయంగా నాణ్యతను పరిశీలించారు. నిర్మాణం నాసిరకంగా ఉన్నట్లు తన దృష్టికి వస్తే తిరిగి నాణ్యతగా నిర్మించేలా చూశారు. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేసిన ఒక్క రోడ్డు కూడా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఈ రోడ్లను అప్పట్లో టీడీపీ నాయకులు తమలపాకులా రోడ్లు వేశారని ఎద్దేవా చేశారు. ఒక్క వర్షానికే కొట్టుకుపోతున్న రోడ్లను ఏ ఆకుతో పోల్చుకుంటారో టీడీపీ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు.



దెబ్బతిన్న రోడ్డుపై మట్టి కప్పిన దృశ్యం

వైభవంగా తిరుచ్చి ఉత్సవం



మద్దిలేటిస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి మహామంగళహారతులు సమర్పించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, వేదపండితుడు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు.

జీడీపీలోకి వరద నీరు



గాజులదిన్నె ప్రాజెక్ట్

గోనెగండ్ల: మండలంలో గత రెండు రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.అలాగే గాజులదిన్నె ప్రాజెక్ట్ క్యాచ్‌మెంట్ ఏరియాలో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరినట్లు ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ అలి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దాదాపు 600 క్యూసెక్కుల వరద నీరు జీడీపీలోకి చేరిందన్నారు. ప్రస్తుతం జీడీపీలో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉండగా, శుక్రవారం 600 క్యూసెక్కుల వరద నీరు జీడీపీలోకి చేరిందని ప్రాజెక్టు ఏఈ వెల్లడించారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు.

కూటమి నేతలు ఆదేశించారు.. కమిషనర్ పాటించారు!

- అక్రమ నిర్మాణమంటూ వైఎస్సార్‌సీపీ నేత బంధువు స్థల ప్రహరీ కూల్చివేత
- 20 ఏళ్ల క్రితం నిర్మించిన షెడ్డును కమర్షియల్‌గా మార్చలేదని..





ప్రహరీని జేసీబీతో కూల్చి వేస్తున్న దృశ్యం, బాధితుడు ఈనెల 2వ తేదీన చెల్లించిన వెకెట్ ల్యాండ్ ట్యాక్స్ రసీదు

బేతంచెర్ల: రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు కూటమి నేతలు అటు పోలీసులు, ఇటు అధికారులను ప్రయోగిస్తూ జనాన్ని భయ పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా చేసుకుని అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా వేధింపులు, దాడులకు పాల్పడుతున్నారు. వారి బరితెగింపునకు తాజాగా నగర పంచాయతీ బేతంచెర్లలో చోటు చేసుకున్న ఘటన మరో నిదర్శనంగా నిలుస్తోంది. పట్టణంలో నిబంధనలు పాటించని ఎన్నో నిర్మాణాలు ఉన్నా.. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ వైఎస్సార్‌సీపీ నేత సమీప బంధువుకు చెందిన స్థలం ప్రహరీని కూల్చివేయడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. పట్టణ సమీపంలో కర్నూలు రహదారిలోని షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో రామచంద్రారెడ్డికి 10 సెంట్ల స్థలం ఉంది. అందులో రెండు సెంట్లలో చిన్నపాటి గది నిర్మాణం చేసి, తన స్థలానికి చుట్టూ గోడ కట్టుకొని షెడ్డును ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చాడు. సుమారు 20 ఏళ్లకు పైగా ఉన్న ఈ నిర్మాణాన్ని టీడీపీ నాయకులు అక్రమం అంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కమిషనర్ ఆ వ్యక్తికి నోటీసు ఇచ్చారు. అయితే ఆ స్థలానికి ఈనెల 2వ తేదీన నగర పంచాయతీ అధికారులు వెకెట్ ల్యాంట్ ట్యాక్స్ కూడా రూ.9,100 కట్టించుకున్నారు. అధికార పార్టీ నాయకులు ఒత్తిడి ఎక్కువ కావడంతో సక్రమంగా ఉన్న రామచంద్రారెడ్డి స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, ఎస్‌ఐ రమేష్ బాబు పోలీస్ సిబ్బందితో వెళ్లి శుక్రవారం కూల్చి వేయించారు. ఈ విషయంపై కమిషనర్‌ను వివరణ కోరగా వెకెట్ ల్యాండ్ కింద ట్యాక్స్ చెల్లించారని, ఇది కమర్షియల్‌గా మార్చుకోవాలని సూచించామన్నారు. అయితే కమర్షియల్ స్థలం కాకపోయినా మార్చుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణంలో ఎన్నో అక్రమ నిర్మాణాలు ఉన్న వాటిని వదిలేసి.. సక్రమంగా ఉన్న నిర్మాణాలను కూల్చడం వెనక అధికార పార్టీ నాయకులకు కమిషనర్ వత్తాసు పలుకుతున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

బెలుం గుహలకు ప్రపంచ స్థాయి గుర్తింపు

- భౌగోళిక వారసత్వ జాబితాలో చోటు
- జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వెల్లడి



విద్యుత్ దీపాల వెలుగుల్లో బెలుం గుహలు

కొలిమిగుండ్ల: భూమి అంతర్భాగంలో సహజ సిద్ధంగా ఏర్పడిన అద్భుత బెలుం గుహలకు ఎట్టకేలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించనుంది. దేశంలో మేఘాలయలోని క్రెమ్ లియాట్ ప్రాహ్ గుహల తర్వాత రెండవ అతి పెద్ద గుహలుగా నిలిచాయి. ప్రపంచంలో రెండో గుహగా బెలుం గుహలను గుర్తించారు. కొలిమిగుండ్ల–బెలుం ప్రధాన రహదారిలో ఇవి విస్తరించాయి. భౌగోళిక వారసత్వ ప్రదేశంగా జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇటీవల వెల్లడించింది. గుహల అందాలను తిలకించేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారసత్వ సంపద జాబితాలో చోటు దక్కించుకోవడంతో బెలుం గుహలకు మరింత ప్రాచుర్యం లభించనుంది. విదేశీ పర్యాటకులు ఆకట్టుకునేలా ప్రచారం కల్పించేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. పదివేల సంవత్సరాల క్రితం చిత్రావతి నది ప్రవాహంతో ఈ గుహలుగా ఏర్పడ్డాయి. 3,229 మీటర్ల మేర గుహలు విస్తరించి ఉన్నాయి.

వెలుగులోకి ఇలా:

1884లో బ్రిటిష్ సర్వేయర్ రాబర్ట్ బ్రూస్ ఫూట్ ద్వారా ఈ గుహలు వెలుగులోకి వచ్చాయి. 1982–84 వరకు డేనియల్ గేబర్ నేతృత్వంలో జర్మన్‌కు చెందిన స్పెలియాలజిస్టులు గుహల్లో అన్వేషణ చేశారు. 1988లో అప్పటి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని రక్షిత ప్రదేశంగా గుర్తించి ఆధీనంలోకి తీసుకుంది. 1999లో పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకొని లోపల పలు అభివృద్ధి పనులు చేపట్టింది. 2003లో పర్యాటకుల సందర్శనకు అనుమ తి ఇచ్చింది. బెలుం గుహలు వెలుగులోకి వచ్చాక మొట్టమొదటి సారిగా 2020 ఫిబ్రవరిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బెలుం గుహల ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. వేలాది మంది పర్యాటకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గుహల సందర్శన తర్వాత పర్యాటక శాఖకు ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఆదాయం సమకూరుతుంటుంది. కానీ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉందన్న విమర్శలు ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు

- ఉద్దేశపూర్వకంగా వాహనాల స్వాధీనం
- 25 రోజులైనా ఎందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు
- మైనింగ్ అధికారులపై జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ఆగ్రహం
- హంద్రీ–నీవా పనులపై అసహనం
- హుందాగా సాగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



సెల్‌ఫోన్‌లో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫొటోలను చూపుతున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు

కర్నూలు(అర్బన్): ' ఏడాది కాలంగా వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తున్నారు .. అక్రమ మైనింగ్ జరు గుతుంటే కేసులు నమోదు చేయండి, కానీ ... రాజకీ య ఒత్తిళ్లతో ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మంచి పద్ధతి కాదు' అంటూ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్‌పై జరిగిన చర్చలో చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ ... బెలుం శింగవరం గ్రామ శివారుల్లో గత నెల 20న మైనింగ్ అధికారులు స్థానిక పోలీసుల తో కలిసి దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పేరం రాంశంకర్‌రెడ్డికి చెందిన ప్రొక్లెయినర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇతరులకు చెందిన గని వద్ద నిలిచి ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇంతవరకు ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం, నోటీసు ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.

పల్లెల్లో బెల్ట్ షాపులతో అనేక అనర్థాలు ...

గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని జెడ్పీ చైర్మన్ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కంటితుడుపు చర్యగా కాకుండా ఎక్సైజ్ అధికారులు స్థానిక పోలీసుల సహకారాన్ని కూడా తీసుకొని గ్రామాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలను నిర్మూలించాలన్నారు. ఎక్కడబడితే అక్కడ మద్యం లభిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యక్రమాలు అధికమవుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రవాణా శాఖ అధికారులు ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జరిమానాలను విధించడంతో పాటు స్కిట్ల రూపంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

హంద్రీనీవా పనులపై అసహనం

జిల్లాలో 88 నుంచి 216వ కిలోమీటర్ వరకు జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ వైడనింగ్, లైనింగ్ పనులపై జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అస హనం వ్యక్తం చేశారు. దాదాపు రూ.439 కోట్లతో ఈ పనులను చేపడుతున్నారని, అయితే ఇటీవల కురిసిన వర్షాలకే పత్తికొండ మండలం పందికోన సమీపంలో (108.1 కిలోమీటర్) కాలువ లైనింగ్ దెబ్బతినడం చూస్తే ఈ పనులను ఎంతమేరకు నాణ్యతతో చేపట్టారో అర్థమవుతున్నదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన తన సెల్‌ఫోన్‌లో దెబ్బతిన్న లైనింగ్ పనుల ఫొటోలను చూపించారు. జిల్లాలోని వివిధ కెనాల్స్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో మట్టిని తరలిస్తే చట్టపరంగా శిక్షార్హులు అవుతారని బోర్డులు పెట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

అభాసుపాలైన విద్యా శాఖ

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ విద్యా సంవత్సరంలో విద్యా శాఖ పూర్తి స్థాయిలో అభాసుపాలైందని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు అనేక మందికి రీవ్యాల్యుయేషన్, రీకౌంటింగ్‌లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఫెయిల్ అయిన, మార్కులు తక్కువగా వచ్చాయని ఎంత మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు? దరఖాస్తు చేసుకున్న వారిలో మంది ఉత్తీర్ణులయ్యారు? ఎంత మందికి మార్కులు పెరిగాయనే అంశాలపై పూర్తి సమాచారాన్ని వచ్చే సమావేశాల నాటికి అందించాలని ఆయన విద్యాశాఖ అధికారులను కోరారు.

బిల్లులను వెంటనే పంపించండి

వేసవిని దృష్టిలో ఉంచుకొని జెడ్పీ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను వారంలోగా పంపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశించారు. ఇయర్ మార్క్‌డ్ నిధులతో ఎస్సీ, ఎస్టీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల పరిధిలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను కూడా జూలై నాటికి పంపించాలన్నారు. ఇంకా ఈ పనులు 129 పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోందని, వీటిని కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. కోర్టు ఆదేశాల మేరకు జెడ్పీ ప్రాంగణంలోని చైర్మన్ బంగ్లా నిర్మాణానికి గతంలో లీజుకు తీసుకున్న వ్యక్తి రూ.1.25 కోట్లను డిపాజిట్ చేసిన వెంటనే టెండర్లను పిలిచి పీఆర్ ఆధ్వర్యంలో బంగ్లాను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ చెప్పారు. సమావేశాల్లో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

సాగులో తోడై.. మట్టిలో మాయమై!

- విద్యుదాఘాతంతో కాడెద్దు అక్కడికక్కడే మృతి
- ఓ రైతు, మరో కాడెద్దుకు గాయాలు



విద్యుత్ షాక్‌తో పొలంలో మృతి చెందిన ఎద్దు

కోడుమూరు రూరల్: ఏరువాక గడిచి వారమైనా కాలేదు. ఎద్దుల సంబరం కళ్లలోనే ఉంది. పిలిస్తే పలికే నేస్తం కళ్లెదుటే కాలమైంది. తోబుట్టువుగా మెలిగి.. సాగులో భాగమైన మూగజీవం ఆ మట్టిలోనే మాయమైంది. పొలం పనులు చేస్తుండగా చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదం ఓ కాడెద్దును బలిగొంది. ఈ ఘటన కోడుమూరు మండలం కొత్తపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కొత్తపల్లెకు చెందిన కంచి భాస్కర్‌కు ఐదెకరాల పొలం ఉంది. మూడేళ్ల క్రితం గోరంట్ల జాతరలో రూ.లక్ష పెట్టి కోడెదూడలను కొనుగోలు చేశాడు. వీటిని ఆ కుటుంబం ఎంతో అపురూపంగా చూసుకుంటోంది. వీరి పొలం పనులతో పాటు గ్రామంలో ఇతర రైతులు పిలిచినా కాడెద్దులను కూలీకి తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక రైతు మేకలగిడ్డయ్య పత్తి పంట సాగు చేయగా.. శుక్రవారం పత్తిలో కలుపు పాసేందుకు భాస్కర్‌కు చెందిన కాడెద్దులను మాట్లాడుకున్నాడు. అతని కుమారుడు రవి కాడెద్దులతో పత్తి పొలంలో గొర్రు తోలుతుండగా బోరు కనెక్షన్‌కు ఇచ్చిన కరెంటు వైర్ల సపోర్టు కట్టె తగిలింది. కాడెద్దుల తాకిడికి కట్టె విరిగిపోయి విద్యుత్ తీగలు వాటిపై తెగిపడ్డాయి. రవికి కూడా స్వల్పంగా విద్యుత్‌షాక్ తగలడంతో వెంటనే అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపేయాలని కేకలు వేయడంతో సమీపంలోని రైతులు స్పందించారు. అప్పటికే ఓ ఎద్దు మృతి చెందగా, మరో ఎద్దుకు విద్యుత్ షాక్‌కు గురైంది. స్వల్ప గాయాలైన రవిని కోడుమూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించగా కోలుకున్నాడు. గాయపడిన ఎద్దును పశువైద్య శాలకు తీసుకెళ్లగా సత్వర వైద్యంతో కళ్లు తెరిచింది. అయితే కళ్లెదుటే ఓ ఎద్దు మృత్యువాత పడటాన్ని ఆ రైతు కుటుంబం జీర్ణించుకోలేకపోయింది. ఘటనా స్థలంలో కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న రైతులను కూడా కంటతడి పెట్టించింది.

క్లుప్తంగా

మహానందిలో శృంగేరి విరూపాక్ష పీఠాధిపతి



పీఠాధిపతికి స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో శృంగేరి విరూపాక్ష పీఠం ప్రస్తుత పీఠాధిపతి శ్రీ శ్రీ విద్యా నృసింహ భారతి స్వామి శుక్రవారం పూజలు చేశారు. వేద పండితులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు గావించారు. దర్శనం అనంతరం పీఠాధిపతుల వారికి పండితులు మహానందీశ్వరుని ప్రసాదాలు అందించారు.

టీడీపీ నాయకులూ.. మదర్సాలనూ వదలరా!

● కర్నూలులో ముస్లింల ఆందోళన



ధర్నాచేస్తున్న ముస్లింలు

కర్నూలు (టౌన్): 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు, అనుచరులు వక్ఫ్ బోర్డు స్థలాలను కబ్జా చేస్తున్నారని, మదర్సాల స్థలాన్ని సైతం వదలరా' అంటూ ముస్లింలు కర్నూలు నగరంలో ఆందోళన నిర్వహించారు. కర్నూలులో ఉన్న ఒకరిద్దరు మంత్రి దగ్గర ఉంటున్నారని, రాత్రికి రాత్రి మదర్సా స్థలం కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. స్థలంలో అడుగు పెట్టకూడదంటూ బెదిరింపులు చేస్తున్నారన్నారు. శుక్రవారం మసీదులో ప్రార్థనల అనంతరం కర్నూలు ప్రకాష్‌నగర్‌లోని రోజా వీధిలో మదర్సా వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున్న ధర్నా చేశారు. ఈ సందర్భంగా అఫ్సర్ బాషా, సయ్యద్ ఇస్మాయిల్ పీరాలు మాట్లాడుతూ.. రోజా వీధిలో ఉన్న మదర్సా స్థలం కొనుగోలు చేశామన్నారు. ఈ స్థలం వక్ఫ్‌బోర్డుకు ఏ మాత్రం సంబంధం లేదన్నారు. రిజిస్టర్ డాక్యుమెంటు 1432 అని 16 సెంట్లలో ఈ మదరసా ఉందన్నారు. ఇప్పుడు మదర్సా స్థలం రూ. 4 కోట్లు విలువ చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీకి చెందిన సూరి మన్సూర్ ఆలీఖాన్ అనే వ్యక్తి రాత్రికి రాత్రి ఈ మదర్సాను స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించారు. ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు స్పందించడం లేదన్నారు. ఎవరూ అడుగు పెట్టకూడదని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఉన్న మదర్సాను నిర్వీర్యం చేయడమే కాకుండా వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. మదర్సాను తమకే అప్పగించాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని మసీదుల నుంచి ముస్లింలను ఏకం చేసి పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: మిడుతూరు మండలం చౌటుకూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ (23) పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయన కొంతకాలంగా ఒమేగా హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన అనారోగ్య సమస్యతో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రక్తదాతా.. సుఖీభవ!

● జిల్లాలో 13 బ్లడ్ బ్యాంకులు, 5 బ్లడ్ స్టోరేజ్ కేంద్రాలు

● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): కుటుంబ సభ్యులు, బంధువులే రక్తదానానికి వెనకడుగు వేస్తున్న ఈ రోజుల్లో మేమున్నామంటూ రక్తదాతలు ఎదురొస్తున్నారు. బాధితులతో ఎలాంటి రక్త సంబంధమూ లేకున్నా రక్తదానం చేసి పరోక్షంగా రక్తసంబంధీకులవుతున్నారు. ఇప్పటికీ బ్లడ్‌బ్యాంకులకు రక్తం కోసం వచ్చిన వారు రక్తం బదులు ఇవ్వాలని కోరితే కుటుంబ సభ్యులే వెనుకబడుగు వేస్తూ రక్తదాతల కోసం వెతుకుతున్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో రక్తదాతల ప్రాధాన్యత పెరిగింది. రక్తంలోని వివిధ గ్రూపులను కనుగొన్న నోబెల్ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త కార్ల్ స్టీనర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదిన ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా నిర్వహిస్తోంది.

బ్లడ్ బ్యాంక్‌లు ఇవీ..

- కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆదోనిలోని ఏరియా హాస్పిటల్‌తో పాటు ప్రైవేటుగా కర్నూలులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి ఏర్పాటు చేశారు.
- కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్, ఆర్‌ఆర్ హాస్పిటల్, అక్షయ బ్లడ్ బ్యాంక్, న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్, కర్నూలు బ్లడ్ సెంటర్, కేర్ బ్లడ్ సెంటర్, మెడిప్లస్ బ్లడ్ సెంటర్, పెంచికలపాడులోని విశ్వభారతి జనరల్ హాస్పిటల్, ఆదోనిలో గోపి చారిటబుల్ బ్లడ్ సెంటర్, ఎమ్మిగనూరులో మహాత్మా గాంధి బ్లడ్ బ్యాంక్‌లు ఉన్నాయి.
- ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, ఓర్వకల్, వెల్దుర్తి, పాణ్యంలలో రక్తనిల్వ కేంద్రాలు ఉన్నాయి.

ముందుకు వస్తున్న రక్తదాతలు

ఆపద కాలంలో అయిన వారికి రక్తదానం చేసే వారు భయపడుతున్న ఈ సమయంలో మేమున్నామంటూ పలువురు దాతలు రక్తం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. రక్తదానం చేస్తే ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో వారు స్వయంగా గుర్తిస్తున్నారు. ఈ మేరకు కర్నూలు,ఆదోని, పత్తికొండ, కోడుమూరు,ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో రక్తదాతలు గ్రూపుగా ఏర్పడి, రక్తం అవసరమైన వారికి అందిస్తున్నారు. ఇంకొందరు సామాజిక మాధ్యమాల ద్వారా గ్రూపులుగా ఏర్పడి రక్తదానం చేస్తున్నారు. దాతల నుంచి రక్తం సేకరించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని రక్తనిధికి ఒక రవాణా వాహనం ఏర్పాటు చేశారు.

300 ఎం.ఎల్ రక్తమే సేకరిస్తారు

ప్రతి వ్యక్తిలో నిత్యం ఐదు లీటర్ల రక్తం ప్రవహిస్తుంది. ఆరోగ్యంగా ఉన్న వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం సమయంలో ప్రతి వ్యక్తి నుంచి కేవలం 300 ఎంఎల్ రక్తం మాత్రమే సేకరిస్తారు. ఆ రక్తం మళ్లీ కొన్ని గంటల్లోనే శరీరంలో తయారవుతుంది. అన్ని పరీక్షలు చేసిన తర్వాతే రక్తం సేకరిస్తారు. సేకరించిన రక్తాన్ని అవసరం ఉన్న రోగులకు ఎక్కిస్తారు.



రక్తదానం చేస్తున్న యువత



రెడ్‌క్రాస్ రక్తనిధి భవనం

రక్తదానానికి అర్హత...

- దాత బరువు 45 కిలోలు ఉండాలి
- 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉండాలి
- నిమిషానికి 60 నుంచి 100సార్లు నాడి కొట్టుకోవాలి
- రక్తంలో హిమోగ్లోబిన్ శాతం 12.5గ్రాములకు పైగా ఉండాలి

ఐదేళ్లుగా రక్తదానం వివరాలు

సంవత్సరం	మొత్తం రక్తదానం (యూనిట్లలో)	దాతల ద్వారా సేకరించిన రక్తం	నిర్వహించిన క్యాంపులు	క్యాంపుల ద్వారా రక్తదాన సేకరణ
2021-2022	48,135	37,926	99	4,615
2022-2023	51,076	39,086	216	7,939
2023-2024	50,123	39,758	228	6,537
2024-2025	52,845	43,641	177	5,145
2025 మే వరకు	5,284	4,423	7	527
మొత్తం	2,07,463	1,64,834	727	24,763

అవగాహన పెంచుతున్నాం



రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా యువత రక్తదానానికి ముందుకు వచ్చేలా చేసేందుకు కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకు గాను డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేశాం. అడిగిన వెంటనే వచ్చి యువత రక్తదానం చేస్తున్నారు. దూరప్రాంతాల వారి కోసం సీహెచ్‌సీల్లోనే బ్లడ్‌స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రక్తదాతలను సన్మానించనున్నాం. –డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో, కర్నూలు

అడిగిన వెంటనే రక్తం ఇస్తున్నారు



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు రక్తనిధిలో ప్రతి సంవత్సరం 7వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నాం. ఇలా సేకరించిన రక్తంలో 30 శాతం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు, 20 శాతం తలసీమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా అందజేస్తున్నాం. పేదవారెవ్వరైనా వస్తే వారికి ఉచితంగా రక్తం ఇస్తున్నాం. ఈ మేరకు వీరు పేదవారని సంబంధిత ఆసుపత్రి వైద్యులచే రాయించుకుని రావాల్సి ఉంటుంది. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14వ తేదీ రక్తనిధి ప్రాంగణంలో రక్తదాతలు, ఎన్‌జీవోలు, సహకరించిన వారికి జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, అడిషనల్ డీఎంహెచ్‌వో చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ఇచ్చి సన్మానించనున్నాం. –డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, కర్నూలు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

● మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

కర్నూలు: మున్సిపల్ శాఖలోని అత్యవసర విభాగమైన నీటి సరఫరా, వీధి దీ పాల కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టీడీపీ కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు మనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేషులు, కోశాధికారి సునీల్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నారాయణ, మధు తదితరులతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో తిక్కారెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

● ఐదుగురికి గాయాలు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎరుకల కాలనీకి చెందిన చిన్న రంగయ్య కుటుంబ సభ్యులతో కలిసి సంచార జీవనం కొనసాగిస్తూ గ్రామాల్లో బైక్‌లపై ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం వ్యాపారం చేసుకునేందుకు ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల సమీపంలో చిన్నరంగయ్య తనతోపాటు ఐదుగురు కుటుంబ సభ్యులతో బైక్‌లపై వస్తుండగా హైదరాబాద్ నుంచి కడప వైపు నుంచి వెళ్తున్న కారు అదుపు తప్పి బైక్‌లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నందిని (16) అక్కడికక్కడే మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు చిన్నరంగయ్య, నేతనేలు, సుజాత, మద్దమ్మ, కుమారి గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. మృతురాలి అక్క అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

మద్యమే ప్రాణం తీసిందా?

● పోలకల్ పీహెచ్‌సీలో మృతదేహం



రామకృష్ణ (ఫైల్)

సి.బెళగల్: పోలకల్ గ్రామానికి చెందిన రామకృష్ణ (36)కు మద్యం తాగే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. అయితే ఆయన శుక్రవారం పోలకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లోని పాత భవనంలో విగతజీవిగా కనిపించారు. మద్యమే ఆయన ప్రాణం తీసిందా.. వేరే కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది. పోలకల్ పీహెచ్‌సీలోని పాత భవనం నుంచి దుర్వాసన రావడంతో కొంతమంది యువకులు, గ్రామస్తులు పరిశీలించగా మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని పీహెచ్‌సీ వైద్యులకు, సి.బెళగల్ పోలీస్‌లకు చెప్పారు. ఎస్‌ఐ పరమేష్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రామకృష్ణ ఈనెల 10న కడుపులో మంట అంటూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా అతని తమ్ముడు రవి పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. అనంతరం రామకృష్ణ పీహెచ్‌సీలోనే కాసేపు విశ్రాంతి తీసుకుంటానని చెప్పడంతో రవి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు వరకు (బుధవారం) ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో, పీహెచ్‌సీ పరిసరాలలో గాలించినా ఆచూకీ లభించలేదు. అప్పుడప్పుడు వేరే ఊర్లకు వెళ్లి నెల, పదిహేనురోజులు ఉండి ఇంటికి వచ్చే అలవాటు రామకృష్ణకు ఉండటంతో అతను ఇంటకి రాకపోవడాన్ని కుటుంబ సభ్యులు తేలికగా తీసుకున్నారు. తీరా శుక్రవారం రామకృష్ణ మృతదేహమై పీహెచ్‌సీలో కనిపించాడు. అయితే రామకృష్ణ మృతిపై విషయాలను తెలుసుకోవాలని ఎస్‌ఐ పరమేష్ నాయక్ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులతో విచారణ చేయించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం కోసం పోలీస్‌లు ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణకు భార్య కృష్ణవేణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



పోలకల్ పీహెచ్‌సీలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

వామ్మో.. నాగుపాము

మహానంది: నందిపల్లెకు చెందిన నాగరాజు ఇంట్లో శుక్రవారం సుమారు ఆరు అడుగులకు పైగా ఉన్న నాగుపాము నాగుపాము కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. వెంటనే ఆయన అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. ఆయన పామును పట్టుకుని సమీప నల్లమల అడవిలో వదిలేశారు. ఇదిలా ఉండగా ఈ పాము ఐదు కప్పలను మింగడం విశేషం. అయినా ఎంతో చలాకీగా కనిపించినట్లు స్నేక్ క్యాచర్ మోహన్ తెలిపారు.



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

కేసీసీ రుణాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ రాఘవరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్):చేపల ఉత్పత్తి, మార్కెటింగ్ అభివృద్ధికి బ్యాంకులు కిసాన్ క్రెడిట్ కార్డుల (కేసీసీ) కింద రూ.2.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశం నగరంలోని జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. సంఘం చైర్మన్ నవీన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేడీ మాట్లాడుతూ కేసీసీ కింద గత ఏడాది వరకు గరిష్టంగా రూ.1.65 లక్షల వరకు ఉన్న రుణ సదుపాయాన్ని ప్రస్తుతం రూ.2.50 లక్షలకు పెంచారన్నారు. ఎలాంటి హామీ లేకుండా ఈ రుణ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. ఈసారి 1200 మంది మత్స్యకారులకు రుణాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎల్‌డీఎం రామచంద్రరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి రంగనాథబాబు, ఏడీ సంధ్యారాణి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో కర్ణాటక మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నక్కల సునీల్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ శుక్రవారం తెలిపారు. నిందితుడి నుంచి 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. అదే గ్రామానికి చెందిన మద్యం సరఫరాదారుడైన నక్కల సురేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

పశుసంవర్ధక శాఖలో రాజకీయ బదిలీలు

బేరసారాలు, పైరవీలు ముగియడంతో జాబితా విడుదల

● ఒకటి,రెండు సామాజిక వర్గాలకే బదిలీల్లో పెద్దపీట

● పలువురు పశువైద్యులకు వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి దూరప్రాంతాలకు బదిలీ

● పసుపల వెటర్నరీ డాక్టర్ మంత్రాలయంకు మార్పు

● 16 మంది ఏడీలు, 65 మంది పశువైద్యులకు స్థానచలనం

బదిలీ అయిన ఏడీల వివరాలు

ఏడీ పేరు	ప్రస్తుతం స్థానం	బదిలీ స్థానం
గిడ్డయ్య	రుద్రవరం	కర్నూలు వీపీసీ
భవానీశంకర్‌రెడ్డి	ఆత్మకూరు	కర్నూలుడీడీ ఆఫీసు
రవిప్రకాశ్‌రెడ్డి	పత్తికొండ	గొర్రెల అభివృద్ధి విభాగం
మాధవి	కర్నూలు డీడీ ఆఫీసు	పత్తికొండ
భారతి	ఆదోని డీడీ ఆఫీసు	గుత్తి
ధనుంజయుడు	వెలుగోడు	ఆలూరు
విక్టర్	ఆలూరు	ప్యాపిలి
కిషోర్‌కుమార్	ప్యాపిలి	కోవెలకుంట్ల
కొండారెడ్డి	ఆళ్లగడ్డ	సంజామల
మోహన్‌రావు	సంజామల	పులివెందుల
సుబాన్‌బాష	గొర్రెల అభివృద్ధి విభాగం	రుద్రవరం
సునీల్	పులివెందుల	ఆళ్లగడ్డ డీడీ ఆఫీసు
సరస్వతి	కోవెలకుంట్ల	వైఎస్ఆర్ కడప జిల్లా
వెంకటేశ్వర్లు	వైఎస్ఆర్ కడప జిల్లా	వెలుగోడు
గీతారెడ్డి	చిత్తూరు	ఆదోనిడీడీ ఆఫీసు
పి.కిశోర్‌కుమార్	బనవాసి	ప్రకాశం జిల్లా

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖ లో ఎట్టకేలకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ లు,అసిస్టెంట్ డైరెక్టర్ల బదిలీల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. బేరసారాలు కుదిరిన తర్వాతనే తుదిజాబితాలను విడుదల చేశారు. వాస్తవానికి ఈ నెల10నే బదిలీ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ.. రాజకీయ జోక్యం, పైరవీలు తదితరాల కారణంగా అమలును నిలిపివేశారు. సుదీర్ఘంగా సాగిన పైరవీలు, బేరసారాల అనంతరం బదిలీ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి చాలామంది పశువైద్యులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. కర్నూలు మండలం పసుపల పశువైద్యురాలుకు వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి మంత్రాలయానికి మార్పు చేయడం గమనార్హం. ఈమె ఏడు నెలల గర్భిణి.. ఇతర వ్యాధులతో బాధపడుతున్నా కూటమి నేతల్లో కనీస మానవత్వం లోపించింది. బదిలీల్లో ఒకటి, రెండు సామాజిక వర్గాలకే పెద్దపీట వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ నేతల సిఫార సు లేఖలు ఉంటేనే కోరుకున్న చోటుకు బదిలీ చేసే విషయాన్ని పరిశీలిస్తామని ఉన్నతాధికారులే తేల్చి చెప్పడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు దాదాపు 65 మంది బదిలీ అయ్యారు. 16 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు స్థానచలనం కలిగింది.

కార్మికుల కడుపు కొడుతున్న కూటమి

● పని సమయం 8 నుంచి 10 గంటలకు పెంచడం అనాగరిక చర్య



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచి కార్మికుల కడుపు కొడుతోందని, పని సమయం 8 నుంచి 10 గంటలకు పెంచడం అనాగరిక చర్య అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన విధానంతో మహిళలు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. శ్రమ దోపిడీపై పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ.. ఇద్దరు మహిళల అరెస్ట్

గుంతకల్లు టౌన్: దుకాణంలో చేతి వాటాన్ని ప్రదర్శించిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. గుంతకల్లు వన్‌టౌన్ ఏఎస్‌ఐ థామస్ డెన్నీ తెలిపిన మేరకు... గత నెల 19న గుంతకల్లులోని ధర్మవరం గేట్ రోడ్డులోని అరుణాచల వరల్డ్ ఆఫ్ ఫ్యాషన్స్ దుకాణానికి కర్నూలు నగరంలోని చెంచు నగర్‌కు చెందిన చెంచు గోవిందమ్మ, చెంచు లక్ష్మి వెళ్లారు. ఆ సమయంలో దుకాణ యజమాని, సిబ్బంది దృష్టిని ఏమార్చి దాదాపు రూ.25 వేలు విలువ చేసే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను అపహరించారు. రెండు గంటల అనంతరం వచ్చిన మరో కస్టమర్లకు చూపించేందుకు వెతికితే ఆభరణాలు కనిపించలేదు. దీంతో దుకాణ యజమాన్ని బద్రీనాథ్ వెంటనే సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించడంతో ఇద్దరు మహిళలు నగలను అపహరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. గుంతకల్లులోని ట్విన్ లైన్ వద్ద మహిళలను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 వేలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రాణం ఖరీదు..రూ.15 లక్షలు?



మృతిచెందిన పక్కీరయ్య(ఫైల్)

జూపాడుబంగ్లా: పీఎస్‌కే కంపెనీకి చెందిన కంకర మిక్సింగ్ మిల్లర్ కిందపడి మృతిచెందిన పక్కీరయ్య(45) ప్రాణానికి కంపెనీ యాజమాన్యం రూ.15 లక్షల వెలకట్టినట్లు సమాచారం. నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు నిర్మాణం పనులు చేస్తూ గురువారం తర్తూరు అంచె సమీపంలో కంకర మిక్సింగ్ మిల్లర్ కింద పడి బొల్లవరం గ్రామానికి చెందిన పక్కీరయ్య మృతిచెందాడు. మృతుని భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం పీఎస్‌కే కంపెనీ యాజమాన్యంతోపాటు కంకర మిక్సింగ్ మిల్లర్ డ్రైవర్ నరేష్‌యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే బేరసారాలు జరిపినట్లు సమాచారం. మృతుని బంధువుల డిమాండ్ మేరకు పీఎస్‌కే కంపెనీ యాజమాన్యం రూ.15 లక్షలతో పాటు ఇన్సూరెన్స్ డబ్బు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. అలాగే వారం క్రితం రోడ్డు పక్కన తీసిన గుంతలో చెట్లు నాటుతూ తంగడంచ గ్రామానికి చెందిన బన్నూరు పుల్లయ్య(60) అదే గుంతలో పడి మృతి చెందిన విషయాన్ని పీఎస్‌కే కంపెనీ యాజమాన్యం బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.